క్లుప్తంగా

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్ళం అంజిరెడ్డి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై హెచ్‌ఎం తాతిరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2024 పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. సమగ్ర శిక్షణ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వొకేషనల్ ట్రైనర్ పి.అరవింద్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు తాడేపల్లి పట్టణ పరిధిలోని బైక్ మెకానిక్ షాప్ వద్ద ఆటోమోటివ్ ట్రేడ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

ఈఓపీఆర్డీగా పూర్ణ శంకరరావు



మేడికొండూరు: మేడికొండూరు మండల ఈఓపీఆర్డీగా పాటిబండ్ల పూర్ణ శంకరరావు మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొల్లిపర మండలం నుంచి మేడికొండూరు మండలానికి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పూర్ణ శంకరరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం



మేడికొండూరు: ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. మంగళవారం కార్యక్రమం ముగిసిన అనంతరం ఎంపీడీఓ తోట చందన మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, భవనాలు, సొంత ఆదాయ వనరులు, వీధి దీపాలు తదితర అంశాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. పంచాయతీ సమస్యలపై చర్చించామన్నారు. ఈఓపీఆర్డీ పాటిబండ్ల పూర్ణ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోత్స్న మృతికి సంతాపం

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవాల అధ్యక్షురాలు జ్యోత్స్న ఆకస్మిక మృతిపై ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి మంగళవారం తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జ్యోత్స్న మృతి మహిళా లోకానికి తీరని లోటని, ఆమె విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారని, తరుణీ తరంగాలు కార్యదర్శిగా సేవలందించారని, విహార యాత్రలో రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందడం బాధాకరమన్నారు. ఐద్వా తరఫున జ్యోత్స్న భర్త రాజేంద్రప్రసాద్‌కు, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన చెక్కును టీడీపీ నాయకులు మంగళవారం ఆ పార్టీ తాడేపల్లి పట్టణ కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణానికి చెందిన పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న దానబోయిన సుందరరావు యాదవ్‌కు మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును అందజేశామని తెలిపారు. నాయకులు కేళి వెంకటేశ్వరరావు, అద్దంకి మురళి, మేకా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అమ్మో.. కోనో కార్పస్!

- నగరంలో ఎక్కడ చూసినా కోనో కార్పస్ చెట్లే..!
- ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హాని
- తొలగించాలంటున్న పర్యావరణ ప్రేమికులు



తాడేపల్లి ప్రధాన రహదారి వెంబడి వున్న కోనోకార్పస్ చెట్లు

తాడేపల్లిరూరల్: ప్రపంచంలో వివిధ దేశాలు నిషేధించిన కోనోకార్పస్ మొక్కలను మన రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎక్కడ పడితే అక్కడ విరివిగా నాటారు. మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా చాలాచోట్ల ఈ మొక్కలు దర్శనమిస్తున్నాయి. కోనోకార్పస్ మొక్కల కారణంగా మానవులకు, జంతువులను వివిధ రకాల అనారోగ్యాలు వస్తాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ఇప్పటికీ వాటిని తొలగించకుండా వాటిని సంరక్షిస్తుండడం విశేషం. నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద, జాతీయ రహదారి వెంబడి, ముఖ్య కూడళ్లలో ఈచెట్లు ఏపుగా పెరిగాయి.

ఈ మొక్కలపై పక్షులు వాలవు.. కీటకాలు జీవించవు

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ మొక్కలను వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సహజంగా ఎక్కడ చెట్లు ఉన్నా ఆ చెట్లపై వివిధ రకాల పక్షులతో పాటు, కీటకాలు నివాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆ చెట్టునే ఆహారంగా చేసుకుని కొన్ని జీవులు జీవిస్తుంటారు. ప్రమాదకరమైన కోనో కార్పస్ మొక్కపై విషపూరితం కావడంతో పక్షులు గానీ, ఇతర కీటకాలు గానీ జీవించవు. శంఖు రూపంలో (కోన్ ఆకారం)లో పచ్చగా, అందంగా, ఆకర్షణీయంగా కనిపించే కోనోకార్పస్ మొక్కలు లేదా చెట్లు రహదారుల వెంబడి, డివైడర్లలో ఎక్కువగా కనిపిస్తుంటాయి. కోనోకార్పస్ పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు కారణం అవుతోందని వృక్ష, పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్వాస సంబంధ వ్యాధులు..

కోనోకార్పస్ అమెరికా ఖండంలోని తీరప్రాంతానికి చెందిన మొక్క. ఇదిప్రధానంగా ఉత్తర అమెరికాలోని సముద్రతీర ప్రాంతాల్లో పెరిగే మాంగ్రూవ్ జాతి మొక్క. వేగంగా, ఎత్తుగా పచ్చగా పెరుగుతుంది. అరబ్, మధ్య ప్రాచ్య దేశాల్లో కోనోకార్పస్‌ను దమస్ అని పిలుస్తారు. అరబ్, మధ్య ప్రాచ్య దేశాల్లో ఎడారి నుంచి వచ్చే దుమ్ము, ఇసుక తుఫాన్లకు, వేగంగా వీచే వేడి గాలులకు అడ్డుగోడగా పనిచేస్తుందని ఈ మొక్కలను విస్తృతంగా పెంచారు. మొక్క ఏపుగా పెరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతాలను సందర్శించిన నర్సరీల నిర్వాహకులు మన దేశానికి తీసుకువచ్చారు. అయితే ఈ మొక్క శ్వాస సంబంధ వ్యాధులు, అనేక రకాల ఎలర్జీలకు కారణమౌతోందని పలువురు చెబుతున్నారు. సహజంగా మాంగ్రూవ్ జాతి మొక్కలు బలమైన వేర్లు కలిగి భూగర్భంలోకి చొచ్చుకుపోతాయి. గోడలు, ఇతర నిర్మాణాలు వీటి వేర్లతో దెబ్బతింటాయి. ఈ మొక్క పండ్లు, పుష్పాలు తినేందుకు పనికిరావు. కనీసం పక్షులు గూడు కట్టుకునేందుకు కూడా ఈ చెట్టు పనికిరాదు. ఈమొక్క కారణంగా గాలినాణ్యతపై ప్రభావం చూపుతోందని పలువురు ఎయిరోబయాలజిస్టులు పరిశోధనలు నిర్వహించారు. ఆస్తమా పేషంట్ల సంఖ్య ఎక్కువ అవుతుందని, చర్మ సంబంధ అలర్జీ ఉన్న వారిపై ఇవి ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయని అంటున్నారు. వీటిని ఎంత త్వరగా తొలగిస్తే అంత మంచిదని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

నకిలీ వీలునామాలతో ప్రభుత్వ భూమి విక్రయం

- నవులూరులో రూ.40కోట్ల విలువైన ప్రభుత్వ చెరువు భూమి
- కొనుగోలు చేసిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అనుచరురాలు
- రూ.కోటి చేతులు మారినట్లు భోగట్టా



నవులూరులోని ప్రభుత్వ చెరువు భూమి

మంగళగిరి: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆలస్యం అన్నట్లుగా ప్రభుత్వ భూమి కనిపిస్తే నకిలీ వీలునామాలు, దస్తావేజులతో క్రయవిక్రయాలు చోటు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి అయినా 22ఏ జాబితాలో ఉన్నా రిజిస్టర్ కాదని తెలిసినా.. కొనుగోలుదారులు తమ అధికారం, పలుకుబడి, ధనబలంతో రిజిస్టర్ చేయించుకుంటామంటూ ధీమాగా కొనుగోలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు దగ్గరలో సర్వే నెంబర్ 60/1లో ప్రభుత్వ చెరువు భూమి ఉంది. నవులూరుకు చెందిన దళితులు తమ తాతలకు వీలునామా ఉందంటూ నకిలీ వీలునామాతో విక్రయానికి పెట్టారు. ఎకరం రూ.10 కోట్లు మార్కెట్ ధరఉన్న స్థలాన్ని రూ.4కోట్లకే విక్రయానికి పెట్టగా దళారులు టీడీపీ మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అనుచరురాలిని ఆశ్రయించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్కడ తక్కువకు భూమి కొనుగోలుకు వచ్చినా అది ఎలాంటి భూమైనా తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించడం ఈమెకు అలవాటు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్‌ఆర్‌ఐ వద్ద ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి బహిర్గతమై మీడియాకు ఎక్కి సంచలనంగా మారింది. మళ్లీ ఈమె ప్రభుత్వ చెరువు భూమిని కొనుగోలు చేసింది. ఇందులో ఇప్పటికే రూ.కోటి వరకు చేతులుమారగా దళారులు, విక్రయదారులు సొమ్ము చేసుకున్నారు. అది పక్కాగా ప్రభుత్వ చెరువు భూమి : తహసీల్దార్ ప్రభుత్వ చెరువు భూమి విక్రయంపై తహసీల్దార్ ఎస్‌కే మాబు సుభాని వివరణ కోరగా 60/1లో 4 ఎకరాలు ప్రభుత్వ చెరువు భూమి ఉందని, అది 22ఏ జాబితాలో ఉందని క్రయ విక్రయాలు చెల్లవన్నారు. అది చెరువు భూమి అని పక్కాగా ప్రభుత్వ భూమి అని రికార్డులలో నమోదై ఉందన్నారు. భూమి సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నందున సీఆర్‌డీఏ అధికారులతో సంప్రదించి భూమి చుట్టూ కంచె వేసి బోర్డు పెట్టడం జరుగుతుందన్నారు.

గిరిజనులకు వైన్ షాపులు కేటాయించాలి

ఆదివాసీ మేధావుల వేదిక బృందం



అబ్కారీ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ మేధావుల వేదిక బృందం

తాడేపల్లిరూరల్: కల్లుగీత వృత్తిదారుల మాదిరి గిరిజనులకూ వైన్‌షాపులు కేటాయించాలని కోరుతూ ఆదివాసీ మేధావుల వేదిక బృందం మంగళవారం మంగళగిరిలోని అబ్కారీ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్, డిప్యూటీ కమిషనర్ శంకరయ్యలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ మేధావుల వేదిక అధ్యక్షుడు అనుముల వంశీకృష్ణ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి వైన్‌షాపుల కేటాయింపులో 10 శాతం కల్లు గీత వృత్తిదారులకు రిజర్వేషన్ ఏర్పాటు చేసిన నారా లోకేష్‌ను అభినందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు వైన్ షాపులు కేటాయించి ప్రాధాన్యత ఇచ్చారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ట్రైబల్ డిజేబుల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొరి ధర్మయ్య, ట్రైబల్ లిబరేషన్ ఫ్రంట్ అధ్యక్షుడు కిల్లో సంజీవరావు, ఐటీడీఎస్ అధ్యక్షులు శోభ పితంబర్, ఆదివాసీ మేధావుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజారి రామనాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

తాడికొండ: దాడి కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లాం గ్రామానికి చెందిన రాయపూడి కృపాచారికి చెందిన కోర్టులో ఉన్న స్థలంలో నలుగురు వ్యక్తులు కట్టెలు కొట్టుకొనుచుండగా వెళ్లి అడిగినందుకు కృపాచారిని దుర్భాషలాడుతూ వెంటపడి కొట్టడంతో తలపగిలి తీవ్ర రక్తస్రావమైంది. గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స చేసి కుట్లు వేసినట్లు బాధితుడు తెలిపాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్, ఏసీల దొంగ అరెస్ట్

మంగళగిరి: ఏసీ, బైక్‌లను చోరీ చేసే దొంగను అరెస్ట్ చేసినట్లు మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. మంగళగిరి చెందిన మహ్మద్ సుహేల్ అహ్మద్ అనే యువకుడు జల్సాలకు అలవాటు పడి ఇళ్లు, షాపుల్లోని ఏసీలు, బైక్‌లు చోరీ చేసి విక్రయిస్తుంటాడన్నారు. మంగళవారం ఎన్‌ఆర్‌ఐ వద్ద నిందితుడి అదుపులోకి తీసుకుని రెండు బైక్‌లు, ఏసీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు డివైడర్ పైకి లారీ దూసుకెళ్లిన సంఘటన మండలకేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుంచి బియ్యం లోడుతో చెన్నై వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో డివైడర్ పైకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా అటువైపుగా వచ్చే వాహనచోదకులు అప్రమత్తం కావడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. లారీ లోపల డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు.

బాలిక అదృశ్యం

మంగళగిరి: పట్టణంలోని టిప్పర్లబజార్‌లో బాలిక అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు టిప్పర్ల బజార్‌కు చెందిన ఈర్ల రాజు కుమార్తె అనూష ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. మంగళవారం మధ్యాహ్నం బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాలేదు. చుట్టు పక్కల, స్నేహితులకు విచారించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



బాలకార్మిక నిర్మూలన ర్యాలీలో పాల్గొన్న జడ్జి నాగరాజ

సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ

మంగళగిరి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ అన్నారు. మంగళవారం కోర్టు వద్ద డీఎల్‌సీవీ, న్యాయవాదులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో న్యాయమూర్తి పాల్గొన్నారు. నాగరాజ మాట్లాడుతూ 14 సంవత్సారాలలోపు బాల కార్మికులను ఏ పనిలో పెట్టుకున్నా నేరమన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్ఐ బేబి రాణి, కార్మిక శాఖ ఏఎల్‌ఓ సిహెచ్ శ్రీరామమూర్తి, డీఎల్‌ఎస్‌వీ పీఎల్‌వీ రఫీ, సీడబ్ల్యూసీ సుధీర్ కుమార్, ఎంఓలు బాబు, శాంతకుమారి, చైల్డ్ హెల్ప్‌లైన్ కేసు వర్కర్ ఎం.నవీన్‌కుమార్, బార్ అసోషియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సమస్యలు తెలియజేస్తున్న ప్రజలు

ఫిరంగిపురం: ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. నూతన పింఛన్లు అందజేయాలని, వ్యవసాయ భూ సమస్యలు, గ్రామాల్లో సీసీరోడ్లు వేయాలంటూ కొందరు అర్జీలు అందజేశారు. ఫిరంగిపురంలో డివైడర్లతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, సమస్యను పరిష్కరించాలని కొందరు అర్జీ అందజేశారు. గుంటూరు నుంచి నరసరావుపేట వెళ్లే ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సులను సింగల్ స్టాప్‌గా మార్చి ఫిరంగిపురంలో ఆగేలా చూడాలని అర్జీ అందజేశారు. మండవ నరసింహారావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీసీడీ సర్వే త్వరలో ప్రారంభం

ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు

ఫిరంగిపురం: త్వరలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనకబుల్ డిసీజెస్, కమ్యూనకబుల్ డిసీజెస్) సర్వే ఆరోగ్య సిబ్బందిచే ప్రారంభించనున్నట్లు ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, నుదురుపాడు పీహెచ్‌సీల్లో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గర్భిణులు, బాలింతలు, పరిసరాల శుభ్రత, నీటిద్వారా వచ్చే వ్యాధులు వంటివాటి గురించి ప్రజలకు వివరించాలన్నారు. వాటిని ఆశా యాప్‌ల్లో నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. మొదటిసారి గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృత్వయోజన పథకం ద్వారా రూ.3వేలు ప్రభుత్వం అందజేస్తుందని, మిగిలిన రూ.2వేలు ప్రసవం తరువాత వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నట్లు తెలిపారు. రెండో ప్రసవంలో ఆడపిల్ల పుట్టినట్లయితే రూ.6వేలు అందజేస్తారని చెప్పారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లలో ఫిరంగిపురం మండలం జిల్లాలో మొదటిస్థానంలో ఉందని చెప్పారు. ఈసందర్భంగా వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, సిబ్బందిని ఆయన అభినందించారు. వైద్యులు శ్వేత, ఫరీనా, యానీ గ్రేస్, పీఎంఎంఈవై జిల్లా అధికారి డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎన్‌సీడీసీడీ అధికారి డాక్టర్ గిరిధర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు అడ్డొచ్చిన శునకాలు

- రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న ముగ్గురికి గాయాలు
- యువకుడి ప్రాణాలు కాపాడిన హెల్మెట్

తాడేపల్లిరూరల్: శునకాలు రోడ్డుపై స్వైరవిహారం చేయడంతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన తాడేపల్లి పాత జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం పాత జాతీయ రహదారిపై ఐఓసీ వద్ద పదుల సంఖ్యలో శునకాలు రోడ్డుపై తిరుగుతూ ఒకదానిపై ఒకటి దాడి చేసుకోవడంతో ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చాయి. మంగళగిరి నుంచి హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనంపై ప్రకాశం బ్యారేజ్‌వైపు వెళుతున్న యువకుడి ద్విచక్ర వాహనానికి రెండు టైర్ల మధ్య ఒక శునకం వచ్చి పడడంతో ఆ యువకుడు రోడ్డుపైకి ఎగిరి పడ్డాడు. హెల్మెట్ ఉండడంతో అతనికి తలకు ఎటువంటి దెబ్బలు తగలలేదు. కుడిచేయి మోచేయి కింద భాగంలో గాయాలయ్యాయి. పడిపోయిన వాహనాన్ని ప్రకాశం బ్యారేజ్ నుంచి మంగళగిరి వైపు వెళుతున్న వాహనం ఢీకొట్టడంతో ఆ వాహనంపై వున్న ఇద్దరు కిందపడ్డారు. వారికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా ధ్వంసం కాగా ఈ ప్రమాదంలో శునకం మృతి చెందింది. అధికారులు రహదారులపై తిరుగుతున్న శునకాలను నివారించకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉమామహేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకోవాలి

బాధిత కాటికాపరి శాలి బంగారయ్య



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు శాలి బంగారయ్య, పక్కన న్యాయవాది, దళిత నేతలు

మంగళగిరి: రాజధాని అమరావతిలో దళితులపై వివక్ష కొనసాగుతోందని పలువురు దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 5వ తేదీ యర్రబాలెంలో తెలుగుదేశం పార్టీ నేత ఉమామహేశ్వరరావు దళితులను టీ స్టాల్ వద్దకు రానివ్వద్దని వారు వస్తే తాము రామని హుకుం జారీ చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బాధితుడు శాలి బంగారయ్య మంగళవారం న్యాయవాది బరికెల కోటేష్‌తో కలిసి పట్టణంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాటికాపరిగా వుంటున్న దళితుడునైన తనను టీ దుకాణం వద్ద అవమానించిన టీడీపీ నాయకుడు ఉమామహేశ్వరరావుపై కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు బంగారయ్య కోరాడు. తాను నలభై సంవత్సరాలుగా కాటికాపరిగా పనిచేస్తున్నానని తనను అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. టీ దుకాణం వద్దకు టీ తాగేందుకు వెళ్లగా దుకాణ యజమాని తనను ఇకపై టీకి రావద్దని నీవు వస్తే మా వ్యాపారం దెబ్బతింటుందన్నాడని తెలిపారు. తాను ఏం తప్పు చేశానని అడగ్గా.. ఆవిషయం తనకు తనకు తెలియదని.. టీడీపీ నేత ఆకుల ఉమామహేశ్వరరావు నీకు టీ ఇవ్వదని చెప్పారని, ఒకవేళ ఇస్తే తామంతా టీ దుకాణాన్ని బహిష్కరిస్తామన్నారని బెదిరించాడన్నారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా తనను అవమానించడమే కాక టీ దుకాణం వద్దకు రావద్దని అవమానించిన ఉమామహేశ్వరరావుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. తనను తిరిగి కాటికాపరిగా నియమించి న్యాయం చేయాలని కోరాడు. దళిత సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఉండవల్లి రెడ్ల రామమందిరంలో ధనలక్ష్మి అలంకారంలో..



పెనుమాక సీతారామాంజనేయ కాలనీలో మహాలక్ష్మి అలంకారంలో



కంఠంరాజు కొండూరులో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు



విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ధనలక్ష్మి.. ధాన్యలక్ష్మి

మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోను దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పలు అమ్మవారి దేవాయాల్లో అమ్మవారు మహాలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి అలంకారాల్లో మంగళవారం దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– తాడేపల్లి రూరల్, మంగళగిరి, ఫిరంగిపురం



ఫిరంగిపురం విజయదుర్గామాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పాత మంగళగిరిలో శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు



మంగళగిరి మహాలక్ష్మి దేవి అలంకారంలో కాళికామాత



శివాలయంలో శ్రీ భ్రమరాంబిక అలంకారంలో అమ్మవారు



నృసింహస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో ..

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాలధారి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నెంబర్ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం తెల్లవారుజామున అయ్యప్పమాల ధరించిన పల్నాడు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజాము సమయంలో విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే జాతీయరహదారిపై ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం అయ్యప్పమాల ధరించి ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన సిబ్బంది బండి నంబరు ఆధారంగా మృతి చెందిన వ్యక్తి పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పెదగార్లపాడుకు చెందిన ఇంటూరి రాజేష్(32) గా గుర్తించారు. రాజేష్ అయ్యప్పమాల ధరించి విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఢీకొట్టిన వాహనం ఎవరిది అనేది తెలియరాలేదని.. మృతుడి అన్నయ్య కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతి చెందిన రాజేష్‌కు భార్య ధనలక్ష్మితో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.